


Registered No : APTEL/25/A0818

# ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక




గురువారం 13-08-2026 | పేజీలు : 4 | వెల : 2/- | సంపుటి :2 | సంచిక :56 | www.edikadanijam.com | ఎడిటర్ : బాలరాజ్ గౌడ్

## బీఆర్ఎస్ నిలదీస్తే గానీ సోయి రాదా?

- తెలంగాణ ప్రాజెక్టులపై ఏపీ అభ్యంతరాలపై సీఎం రేవంత్ రెడ్డిని నిలదీసిన హరీశ్‌రావు



హైదరాబాద్,12 ఆగస్టు (ఇది కద నిజం): తెలంగాణకు చెందిన ఏడు ప్రాజెక్టులను నిలుపుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (GRMB) ఎజెండాలో ప్రతిపాదించినా.. రాష్ట్ర ప్రభుత్వం ఇంతకాలం ఎందుకు స్పందించలేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు ప్రశ్నించారు. బీఆర్ఎస్ నిలదీసిన తర్వాతే ప్రభుత్వం హడావుడిగా లేఖలు రాస్తోందని విమర్శించారు.

ఏపీ ప్రభుత్వం తెలంగాణ ప్రాజెక్టులపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ GRMB ఎజెండాలో అంశాలను చేర్చినా.. తెలంగాణ ప్రభుత్వం వెంటనే ఎందుకు అభ్యంతరం చెప్పలేదని హరీశ్‌రావు 'ఎక్స్' వేదికగా ప్రశ్నించారు. GRMBని ఎందుకు నిలదీయలేదని, ఏపీ ప్రభుత్వాన్ని ఎందుకు ప్రశ్నించలేదని అన్నారు. "చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు నామమాత్రపు లేఖలు రాస్తే తెలంగాణ ప్రాజెక్టులు కాపాడబడతాయా?" అని ప్రశ్నించారు.

## మంత్రి లోకేష్ రాజీనామా చేయాలి..

- డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ జరపాలని జగన్ డిమాండ్
- గత 74 రోజులుగా 10 రకాల కార్యక్రమాలు నిర్వహించామని వెల్లడి
- డీఎస్సీలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగికే ఫస్ట్ ర్యాంకు వచ్చిందని ఆరోపణ



## కేటీఆర్ చెప్పే రూ.200 కోట్లు ఎక్కడివి?

- భూ కేటాయింపులపై మంత్రి శ్రీధర్‌బాబు ఫైర్.. అసత్య ప్రచారంతో ప్రజలను తప్పుదోవ పట్టించొద్దని హితవు




హైదరాబాద్,12 ఆగస్టు (ఇది కద నిజం): నగరంలో భూ కేటాయింపుల వ్యవహారంపై అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన ఆరోపణలపై మంత్రి శ్రీధర్‌బాబు తీవ్రంగా స్పందించారు. కేటీఆర్ చెబుతున్న రూ.200 కోట్ల లెక్కలు ఎక్కడి నుంచి వచ్చాయో చెప్పాలని డిమాండ్ చేశారు.

## చంద్రబాబుది సొంత డబ్బా!

**వృద్ధిరేటు గొప్పలు కాదు.. ప్రజల సమస్యలకు సమాధానం చెప్పాలి: షర్మిల**



న్యూస్ డెస్క్, 12 ఆగస్టు (ఇది కద నిజం): రాష్ట్రం ఆర్థికంగా పరుగులు పెడుతోందని, జాతీయ సగటు కంటే మెరుగైన వృద్ధిరేటు సాధిస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పడం సొంత డబ్బా అని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. 2025--26 ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో 10.7 శాతం వృద్ధిరేటు నమోదైందంటూ ప్రభుత్వం ప్రచారం చేసుకుంటున్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయని బుధవారం 'ఎక్స్' వేదికగా ఆరోపించారు.

## బీసీ మహిళలకు సర్కార్ 'మిషన్'

- 100% సబ్సిడీతో 1.19 లక్షల ఆటోమేటిక్ కుట్టుమిషన్లు
- 119 నియోజకవర్గాల్లో 1,000 చొప్పున పంపిణీ
- ఇంటి వద్దే స్వయం ఉపాధికి ప్రభుత్వ ప్రోత్సాహం
- బీసీ మహిళలను భవిష్యత్ పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- ఆగస్టు 13న సచివాలయంలో పథకం ప్రారంభం
- మహిళల ఆదాయం పెంచి కుటుంబాలకు ఆర్థిక భరోసా



హైదరాబాద్,12 ఆగస్టు (ఇది కద నిజం): బీసీ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం కీలక పథకానికి శ్రీకారం చుట్టింది. కుట్టు వృత్తిపై ఆసక్తి, నైపుణ్యం ఉన్న పేద, నిరుద్యోగ బీసీ మహిళలకు 100 శాతం ప్రభుత్వ సబ్సిడీతో ఆటోమేటిక్ కుట్టుమిషన్లు అందించనుంది.

రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి 1,000 చొప్పున మొత్తం 1,19,000 కుట్టుమిషన్లను పంపిణీ చేయనున్నారు. లబ్ధిదారులపై ఎలాంటి ఆర్థిక భారం లేకుండా పూర్తిగా ప్రభుత్వ సబ్సిడీతో మిషన్లు అందించడం పథకం ప్రత్యేకత.



## త్వరలో 'జంతర్ మంతర్–2'!

**హాల్ ఇవ్వకుండా అడ్డుకున్నారు.. బీజేపీపై సీజేపీ అధ్యక్షుడు అభిజీత్ దిప్కే ఆరోపణలు**

న్యూఢిల్లీ,12 ఆగస్టు (ఇది కద నిజం): ఢిల్లీలో త్వరలోనే 'జంతర్ మంతర్-2' నిరసన కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని సీజేపీ అధ్యక్షుడు అభిజీత్ దిప్కే ప్రకటించారు. పార్టీ వాలంటీర్ల సమావేశానికి హాల్ కేటాయించకుండా అడ్డుకున్నారని ఆరోపిస్తూ బీజేపీపై తీవ్ర విమర్శలు చేశారు. హాల్ యజమానులపై ఒత్తిడి తెచ్చి సమావేశం జరగకుండా చేశారని ఆరోపించారు.

## అడ్డదారులు వద్దు.. అంతిమంగా నష్టమే!

- యువతకు ప్రధాని మోదీ సూచన.. సోషల్ మీడియా, రీల్స్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని హితవు



న్యూఢిల్లీ,12 ఆగస్టు (ఇది కద నిజం): జీవితంలో అడ్డదారుల వెంట పడొద్దని, అవి తాత్కాలికంగా సులువుగా కనిపించినా అంతిమంగా తీవ్ర నష్టాలకే దారితీస్తాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ యువతకు సూచించారు. సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, రీల్స్ ప్రభావం విషయంలోనూ అప్రమత్తంగా ఉండాలని హితవు పలికారు.

ఢిల్లీలో మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆత్మకథ 'ట్రయంఫ్ ఆఫ్ ది ఇండియన్ రిపబ్లిక్: మై లైఫ్, మై స్ట్రగుల్స్' పుస్తక ఆవిష్కరణ కార్యక్రమంలో బుధవారం ప్రధాని మోదీ ప్రసంగించారు.

## మేడిగడ్డ కేసులో మరో ట్విస్ట్.. కేసీఆర్‌కు మళ్లీ సమన్లు

**మేడిగడ్డ కేసు విచారణ సెప్టెంబర్ 9కి వాయిదా**

**కేసీఆర్‌కు సమన్లు అందలేదా?.. మరోసారి పంపాలని కోర్టు ఆదేశం**

**హైకోర్టు సూచనలతో జిల్లా కోర్టులోనే విచారణ..**



భూపాలపల్లి, 12 ఆగస్టు (ఇది కద నిజం): : కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీకి సంబంధించిన కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కోర్టులో కొనసాగుతున్న ఈ కేసు విచారణను న్యాయస్థానం సెప్టెంబర్ 9కి వాయిదా వేసింది. కేసులో ప్రధాన పిటిషనర్ రాయలింగమూర్తి మృతి చెందడంతో విచారణ కొనసాగింపుపై హైకోర్టు ఇచ్చిన సూచనలను జిల్లా కోర్టు పరిగణనలోకి తీసుకుంది.

## మిల్లర్లకు సీఎం రేవంత్ రెడ్డి వార్నింగ్..

**బ్లాక్‌మెయిల్ చేస్తే సహించం.. డిఫాల్ట్ మిల్లుల స్వాధీనానికి ఆదేశాలు**

- డిఫాల్ట్ అయితే.. మిల్లులు ప్రభుత్వానివే!
- మిల్లర్ల ఆటలు సాగవు: రేవంత్
- గోల్‌మాల్ చేస్తే మిల్లులు స్వాధీనం!



హైదరాబాద్, 12 ఆగస్టు (ఇది కద నిజం): :తెలంగాణలో రైస్ మిల్లర్ల గోల్‌మాల్ వ్యవహారాలు, ప్రభుత్వానికి చెల్లించాల్సిన పెండింగ్ బకాయిలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వాన్ని బ్లాక్‌మెయిల్ చేయాలని చూస్తే ఏమాత్రం సహించేది లేదని హెచ్చరించారు. ఎంసీఆర్ హెచ్ఆర్డీ బోధి పెవిలియన్‌లో పౌరసరఫరాల శాఖపై నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షలో సీఎం అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు.

ఉద్దేశపూర్వకంగా డిఫాల్ట్ అయి ప్రభుత్వ బకాయిలు చెల్లించని రైస్ మిల్లులను తక్షణమే స్వాధీనం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. స్వాధీనం చేసుకున్న మిల్లులను అవసరమైతే మహిళా స్వయం సహాయక సంఘాలకు అప్పగించి మిల్లింగ్ బాధ్యతలు నిర్వహించే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. మిల్లర్ల నుంచి బకాయిల వసూలే ప్రధాన లక్ష్యంగా పక్కా విధానాన్ని రూపొందించాలని ఆదేశించారు.

ఈ విధానంపై త్వరలో కేబినెట్ సబ్‌కమిటీలో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని సీఎం తెలిపారు. ప్రభుత్వ బకాయిల విషయంలో ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా కఠినంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు.

**మహిళా సంఘాలకు గోడౌన్ల బాధ్యత**

ధాన్యం దిగుబడి అధికంగా ఉండే ప్రాంతాలను గుర్తించి తొలిదశలో ఐదు నియోజకవర్గాల్లో పైలట్ ప్రాజెక్ట్‌గా భారీ గోడౌన్ల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. మహిళా సంఘాల ఆధ్వర్యంలో 50 నుంచి 100 ఎకరాల విస్తీర్ణంలో గోడౌన్లను నిర్మించనున్నారు. ఇందుకు గ్రామీణ ఉపాధి హామీ పథకం (MGNREGS) నిధులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సీఎం సూచించారు.

మార్కెట్‌లో ఇప్పటికే అందుబాటులో ఉన్న గోడౌన్లను పూర్తిస్థాయిలో వినియోగించుకోవడంతో పాటు, వాటి నిర్వహణపై పర్యవేక్షణ కోసం ప్రతి జిల్లాకు ఒక నోడల్ అధికారిని నియమించాలని నిర్ణయించారు.

సమావేశంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ స్టీఫెన్ రవీంద్ర, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

## ట్రంప్ దిగే వరకు పోరాటమే!

- అమెరికాతో దీర్ఘకాలిక యుద్ధానికి సిద్ధమన్న ఇరాన్.. 'విజయం మాదే' అంటున్న సీనియర్ సైనిక అధికారి



ఇంటర్నెట్ డెస్క్ ,12 ఆగస్టు (ఇది కద నిజం): అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పదవిలో ఉన్నంతకాలం అమెరికాతో పోరాటాన్ని కొనసాగించే అవకాశం ఉందని ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (IRGC) సీనియర్ సలహాదారు మహ్మద్ రెజా నక్వి సంచలన వ్యాఖ్యలు చేశారు.

## రోడ్డెక్కడం కాదు.. అసెంబ్లీకి రండి!

- జగన్‌కు హోంమంత్రి అనిత సవాల్.. ఆధారాలతో రండి, ప్రతి ఆరోపణకు సమాధానం ఇస్తాం



అమరావతి,12 ఆగస్టు (ఇది కద నిజం):: ప్రభుత్వంపై బయట ఆరోపణలు చేయడం కాకుండా వైసీపీ నేతలు అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై చర్చించాలని ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత సూచించారు

# బీసీ మహిళలకు సర్కార్ 'మిషన్'

మొదటి పేజీ తరువాయి

ఆగస్టు 13న మధ్యాహ్నం 12 గంటలకు హైదరాబాద్‌లోని డా. బీఆర్ అంబేద్కర్ సచివాలయంలోని జీ-29లో పథకం ప్రారంభోత్సవ కార్యక్రమం జరగనుంది. మంత్రి పొన్నం ప్రభాకర్ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించి.. విధివిధానాలు, బడ్జెట్, లబ్ధిదారుల ఎంపిక, అర్హతలు, దరఖాస్తు ప్రక్రియ తదితర వివరాలను వెల్లడించనున్నారు.

ఆధునిక కుట్టుమిషన్లతో మహిళలు ఇంటి వద్దనే స్వయం ఉపాధి పొందడంతో పాటు ఆదాయం పెంచుకునే అవకాశం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని అధికారులు తెలిపారు. మహిళలను కేవలం లబ్ధిదారులుగా కాకుండా ఆదాయం ఆర్జించే స్వయం ఉపాధి మహిళలుగా, భవిష్యత్ మహిళా పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే పథకం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.

కార్యక్రమంలో బీసీ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, బీసీ కార్పొరేషన్ చైర్మన్లు పాల్గొననున్నారు. బీసీ మహిళల ఆర్థిక స్వావలంబనకు ఈ పథకం కీలక ముందడుగుగా నిలవనుంది.

# త్వరలో 'జంతర్ మంతర్-2'!

మొదటి పేజీ తరువాయి

ఢిల్లీలో సీజేపీ వాలంటీర్ల సమావేశం నిర్వహించేందుకు హాల్ కోసం ప్రయత్నించామని, అయితే ఎవరూ అద్దెకు ఇచ్చేందుకు ముందుకు రాలేదని దిప్కే తెలిపారు. అన్ని చోట్లా పైస్థాయి నుంచి ఒత్తిడి ఉందని చెబుతున్నారని పేర్కొన్నారు. చివరకు ఒక హాల్‌ను బుక్ చేసుకుని, దానికి సంబంధించిన రసీదును కూడా పొందామని చెప్పారు.

అయితే మంగళవారం ఉదయం హాల్ యజమానులకు బెదిరింపులు వచ్చాయని దిప్కే ఆరోపించారు. సీజేపీ సమావేశానికి హాల్ ఇస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని బెదిరించారని అన్నారు. "ఇదంతా బీజేపీయే చేస్తోంది" అని ఆరోపించారు. ఇలాంటి చర్యలు దేశ యువత పట్ల బీజేపీకి ఉన్న భయాన్ని స్పష్టం చేస్తున్నాయని వ్యాఖ్యానించారు.

"ఇలాంటి చిన్నచిన్న చర్యలకు మేము భయపడతామని వారు అనుకుంటే పొరపాటే. జంతర్ మంతర్ సీజన్-2 చాలా త్వరలో ప్రారంభం కాబోతోంది" అని దిప్కే ప్రకటించారు.

అయితే హాల్ బుకింగ్ విషయంలో ఒత్తిడి, బెదిరింపులకు సంబంధించి అభిజీత్ దిప్కే చేసిన ఆరోపణలపై బీజేపీ నుంచి ఇంకా స్పందన వెలువడలేదు.

## మేడిగడ్డ కేసులో మరో ట్విస్ట్.. కేసీఆర్‌కు మళ్లీ సమన్లు

భూపాలపల్లి: కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీకి సంబంధించిన కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కోర్టులో కొనసాగుతున్న ఈ కేసు విచారణను న్యాయస్థానం సెప్టెంబర్ 9కి వాయిదా వేసింది. కేసులో ప్రధాన పిటిషనర్ రాయలింగమూర్తి మృతి చెందడంతో విచారణ కొనసాగింపుపై హైకోర్టు ఇచ్చిన సూచనలను జిల్లా కోర్టు పరిగణనలోకి తీసుకుంది.

ఈ వివాదాన్ని జిల్లా కోర్టు పరిధిలోనే పరిష్కరించుకోవాలని హైకోర్టు సూచించిన నేపథ్యంలో కేసు విచారణను ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించారు. అయితే మాజీ సీఎం కేసీఆర్‌కు గతంలో జారీ చేసిన సమన్లు ఇంకా అందలేదని కోర్టు దృష్టికి రావడంతో.. మరోసారి సమన్లు జారీ చేయాలని జిల్లా న్యాయవాదిని ఆదేశించింది.

సెప్టెంబర్ 9కి విచారణ

ఈ కేసులో కీలక నిర్ణయం వెలువడే అవకాశం ఉందన్న నేపథ్యంలో హైదరాబాద్ నుంచి ఎల్అండ్‌టీ సంస్థ ప్రతినిధులు జిల్లా కోర్టుకు హాజరయ్యారు. మాజీ మంత్రి హరీశ్‌రావు తరఫు న్యాయవాదులు కూడా కోర్టుకు వచ్చారు. దీంతో ఉదయం నుంచే కేసుపై ఉత్కంఠ నెలకొంది.

అయితే కోర్టు విచారణను సెప్టెంబర్ 9కి వాయిదా వేయడంతో తుది నిర్ణయం కోసం మరోసారి ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. తదుపరి విచారణలో కేసు ఏ మలుపు తిరుగుతుందన్న అంశంపై ఆసక్తి నెలకొంది.

# రోడ్డెక్కడం కాదు.. అసెంబ్లీకి రండి!



అమరావతి,12 ఆగస్టు (ఇది కద నిజం):: ప్రభుత్వంపై బయట ఆరోపణలు చేయడం కాకుండా వైసీపీ నేతలు అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై చర్చించాలని ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత సూచించారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధైర్యం ఉంటే అసెంబ్లీకి వచ్చి తమ వద్ద ఉన్న ఆధారాలను సభ ముందు ఉంచాలని సవాల్ చేశారు. ప్రజలు ఎన్నుకున్న ఎమ్మెల్యేలకు తమ నియోజకవర్గ సమస్యలను శాసనసభలో ప్రస్తావించడం బాధ్యత అని పేర్కొన్నారు.

మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమం అనంతరం అనిత మీడియాతో మాట్లాడారు. జగన్‌తో పాటు వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీ సమావేశాలకు హాజరై ప్రజల తరఫున మాట్లాడాలని అన్నారు. "రోడ్లపై ఆరోపణలు చేయడం కాదు.. అసెంబ్లీకి వచ్చి చర్చించండి. ప్రతి అంశంపై సమాధానం చెప్పేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. అసెంబ్లీ కంటే గొప్ప ప్రజాస్వామ్య వేదిక మరొకటి లేదు" అని స్పష్టం చేశారు.

మెగా డీఎస్సీపై ఆరోపణలు సరికాదు

మెగా డీఎస్సీ నియామకాలపై వైసీపీ చేస్తున్న ఆరోపణలను హోంమంత్రి ఖండించారు. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో ఒక్క మెగా డీఎస్సీని కూడా పూర్తి చేయలేకపోయిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం చంద్రబాబు డీఎస్సీకి అత్యంత ప్రాధాన్యం ఇచ్చారని, ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించామని తెలిపారు.

డీఎస్సీ నియామకాలన్నీ అక్రమమంటూ ఆరోపణలు చేయడం కష్టపడి ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల ప్రతిభను అవమానించడమేనని అనిత అన్నారు. ఉద్యోగాల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూసి, కుటుంబాలకు దూరంగా ఉంటూ కోచింగ్ తీసుకుని కష్టపడి విజయం సాధించిన యువతలో అనుమానాలు సృష్టించవద్దని సూచించారు. ఆధారాలు ఉంటే అసెంబ్లీకి వచ్చి చూపించాలని, ప్రతి అంశంపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

65 వినతులు.. సిట్‌తో దర్యాప్తు

టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన ప్రజా వినతుల కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి 65 వినతులను హోంమంత్రి స్వీకరించారు. సమస్యలను స్వయంగా తెలుసుకుని, పరిష్కారం కోసం సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

మాషా అల్లా ఎంటర్‌ప్రైజెస్ వ్యవహారంలో డబ్బులు కోల్పోయామని పలువురు బాధితులు హోంమంత్రిని ఆశ్రయించారు. ఈ వ్యవహారంలో సుమారు 200 మంది బాధితులు ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని అనిత తెలిపారు. ఫిర్యాదులపై దర్యాప్తు కోసం డీసీపీ తిరుమలేశ్వరరెడ్డి నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. దర్యాప్తులో తేలే అంశాల ఆధారంగా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# అడ్డదారులు వద్దు.. అంతిమంగా నష్టమే!

మొదటి పేజీ తరువాయి

ఈ సందర్భంగా రైల్వే స్టేషన్లలో కనిపించే "షార్ట్‌కట్ విల్ కట్ యు షార్ట్" అనే హెచ్చరికను ప్రస్తావించారు. అది కేవలం రైల్వే ట్రాక్‌లకు మాత్రమే కాకుండా జీవితానికీ వర్తిస్తుందని అన్నారు.

ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు అందుబాటులో ఉన్నప్పటికీ త్వరగా వెళ్లాలనే తొందరలో కొందరు ప్రమాదకరంగా రైల్వే పట్టాలు దాటుతుంటారని, ఇలాంటి అనాలోచిత నిర్ణయాలు ప్రాణాంతకంగా మారుతాయని ప్రధాని హెచ్చరించారు. ఇదే విధంగా జీవితంలోనూ సులువైన మార్గాల కోసం తప్పుదారులు ఎంచుకోవద్దని సూచించారు.

యువత తప్పుడు మార్గాలను విడిచిపెట్టి అర్థవంతమైన జీవన గమనాన్ని ఎంచుకోవాలని మోదీ పిలుపునిచ్చారు. తాము ఆరాధించే మహనీయుల జీవిత చరిత్రలను చదివి, వారి అనుభవాల నుంచి స్ఫూర్తి పొందాలని సూచించారు. ముఖ్యంగా తమ ఆలోచనా విధానాన్ని ప్రభావితం చేసే సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ల కంటెంట్‌ను విచక్షణతో చూడాలని, రీల్స్ ప్రభావానికి లోనుకాకుండా జాగ్రత్తగా ఉండాలని ప్రధాని హితవు పలికారు.

# ట్రంప్ దిగే వరకు పోరాటమే!

ఇంటర్నెట్ డెస్క్ ,12 ఆగస్టు (ఇది కద నిజం): అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పదవిలో ఉన్నంతకాలం అమెరికాతో పోరాటాన్ని కొనసాగించే అవకాశం ఉందని ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (IRGC) సీనియర్ సలహాదారు మహ్మద్ రెజా నక్దీ సంచలన వ్యాఖ్యలు చేశారు. అమెరికాపై దీర్ఘకాలిక ఒత్తిడి పెంచడం ద్వారా భవిష్యత్తులో ఇరాన్‌పై దాడి చేయాలనుకునే ఏ దేశమైనా భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందనే భయాన్ని కలిగించడమే తమ లక్ష్యమని తెలిపారు.

పీబీఎస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో నక్దీ మాట్లాడుతూ.. ఇరాన్‌కు శాశ్వత భద్రత కల్పించేందుకు బలమైన నిరోధక శక్తిని సాధించాల్సిన అవసరం ఉందన్నారు. అందులో భాగంగా అమెరికాపై ఒత్తిడి పెంచుతూ యుద్ధాన్ని తదుపరి అధ్యక్ష పదవీకాలం వరకు కొనసాగించడం ఒక మార్గమని పేర్కొన్నారు. "అమెరికాపై పోరాడటం ఎలాగో నేర్చుకున్నాం. విజయం కచ్చితంగా మా వైపే ఉంది" అని వ్యాఖ్యానించారు.

అమెరికా స్పష్టమైన వ్యూహం లేకుండానే యుద్ధం చేస్తోందని నక్దీ ఆరోపించారు. వాషింగ్టన్ తన లక్ష్యాలను పదేపదే మార్చుకుంటోందని విమర్శించారు. ఖార్గ్ ద్వీపంపై దాడి, హార్ముజ్ జలసంధిని తిరిగి తెరవడం వంటి అంశాలను అమెరికా తన లక్ష్యాలుగా పేర్కొంటోందని తెలిపారు.

'క్షిపణుల తయారీ వేగం పెంచాం'

యుద్ధం ఎంతకాలం కొనసాగితే తమకు అంత అనుభవం పెరుగుతుందని నక్దీ అన్నారు. గత ఐదు నెలల్లో అమెరికాతో ప్రత్యక్ష పోరాటం ద్వారా ఎలా ఎదుర్కోవాలో నేర్చుకున్నామని చెప్పారు. అమెరికా సైన్యం తాము ఊహించిన దానికంటే బలహీనంగా ఉందని వ్యాఖ్యానించారు.

తాము రోజూ ప్రయోగించే క్షిపణుల కంటే ఎక్కువ సంఖ్యలో కొత్త క్షిపణులను తయారు చేస్తున్నామని నక్దీ పేర్కొన్నారు. యుద్ధం సుదీర్ఘంగా కొనసాగినా క్షిపణి దాడులు కొనసాగించే సామర్థ్యం తమకు ఉందని సంకేతమిచ్చారు. అయితే ఆయన చేసిన ఈ వాదనలను స్వతంత్రంగా ధ్రువీకరించలేమని సమాచారం.

హార్ముజ్‌లో తగ్గిన రాకపోకలు

అమెరికా-ఇరాన్ ఘర్షణలో వ్యూహాత్మకమైన హార్ముజ్ జలసంధి కీలక కేంద్రంగా మారింది. యుద్ధానికి ముందు రోజుకు సగటున 130 నుంచి 140 నౌకలు ఈ మార్గంలో ప్రయాణించగా.. తాజా షిప్పింగ్ డేటా ప్రకారం మంగళవారం కేవలం 8 నౌకలు మాత్రమే జలసంధిని దాటినట్లు రాయిటర్స్ పేర్కొంది.


హార్ముజ్‌ను తిరిగి తెరవాలంటే అమెరికా దిగ్బంధనాన్ని ముగించడం, ఆంక్షలను సడలించడం, స్తంభింపజేసిన ఇరాన్ ఆస్తులను విడుదల చేయడం వంటి రాయితీలు ఇవ్వాలని ఇరాన్ డిమాండ్ చేస్తోంది.

కాల్పుల విరమణపై భిన్నాభిప్రాయాలు

అమెరికా-ఇరాన్ మధ్య కాల్పుల విరమణను పొడిగించే విషయంలోనూ అనిశ్చితి కొనసాగుతోంది. కాల్పుల విరమణను పొడిగించే ప్రశ్నే లేదని ఇరాన్ స్పష్టం చేసింది. మరోవైపు ఇరు దేశాల మధ్య తాత్కాలిక అవగాహనను పునరుద్ధరించే అంశంపై భిన్నాభిప్రాయాలు కొనసాగుతున్నాయి.

ట్రంప్ తదుపరి అధ్యక్ష పదవీకాలం వచ్చే వరకు యుద్ధాన్ని కొనసాగించవచ్చన్న నక్దీ వ్యాఖ్యలు ఇప్పటికే ఉద్రిక్తంగా ఉన్న అమెరికా-ఇరాన్ సంబంధాలకు మరింత ఆందోళనను జోడించాయి. దీర్ఘకాలిక పోరాటం ద్వారా అమెరికాపై ఒత్తిడి పెంచడం, నిరోధక శక్తిని బలోపేతం చేసుకోవడం ఇరాన్ సైనిక వ్యవస్థలోని కొంత వర్గం వ్యూహంగా భావిస్తున్నట్లు ఆయన వ్యాఖ్యలు సూచిస్తున్నాయి.

# బీఆర్ఎస్ నిలదీస్తే గానీ సోయి రాదా?



హైదరాబాద్,12 ఆగస్టు (ఇది కద నిజం): తెలంగాణకు చెందిన ఏడు ప్రాజెక్టులను నిలుపుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (GRMB) ఎజెండాలో ప్రతిపాదించినా.. రాష్ట్ర ప్రభుత్వం ఇంతకాలం ఎందుకు స్పందించలేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు ప్రశ్నించారు. బీఆర్ఎస్ నిలదీసిన తర్వాతే ప్రభుత్వం హడావుడిగా లేఖలు రాస్తోందని విమర్శించారు.

ఏపీ ప్రభుత్వం తెలంగాణ ప్రాజెక్టులపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ GRMB ఎజెండాలో అంశాలను చేర్చినా.. తెలంగాణ ప్రభుత్వం వెంటనే ఎందుకు అభ్యంతరం చెప్పలేదని హరీశ్‌రావు 'ఎక్స్' వేదికగా ప్రశ్నించారు. GRMBని ఎందుకు నిలదీయలేదని, ఏపీ ప్రభుత్వాన్ని ఎందుకు ప్రశ్నించలేదని అన్నారు. "చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు నామమాత్రపు లేఖలు రాస్తే తెలంగాణ ప్రాజెక్టులు కాపాడబడతాయా?" అని ప్రశ్నించారు.

తెలంగాణ నీటి ప్రయోజనాల విషయంలో ప్రభుత్వం రాజీలేని వైఖరి అవలంబించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఏపీ ప్రభుత్వం GRMB ఎజెండాలో చేర్చిన అంశాలను వెంటనే ఉపసంహరించుకునేలా ఒత్తిడి తీసుకురావాలని, అవి తొలగించే వరకు తెలంగాణ ప్రభుత్వం పట్టుబట్టాలని సూచించారు. అవసరమైతే ఆ అంశాలను వెనక్కి తీసుకోకపోతే GRMB సమావేశానికి హాజరుకాబోమని ప్రభుత్వం స్పష్టం చేయాలని అన్నారు.

రాజకీయాల కోసం తెలంగాణ ప్రయోజనాలను పణంగా పెట్టొద్దు అని రేవంత్‌రెడ్డికి హరీశ్‌రావు సూచించారు. తెలంగాణ ప్రాజెక్టులపై ఏపీ అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న సమయంలో ప్రభుత్వం మౌనం వహించడం సరికాదన్నారు. ఇది రాజకీయ అంశం కాదని, తెలంగాణ భవిష్యత్తు, రాష్ట్ర నీటి హక్కులకు సంబంధించిన విషయమని పేర్కొన్నారు.

ఈ నెల 18న హైదరాబాద్‌లో జరగనున్న GRMB సమావేశం ఎజెండాను ఉపసంహరించుకోకుండా సమావేశం నిర్వహిస్తే.. తెలంగాణ ప్రాజెక్టులను కాపాడుకునేందుకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వేలాది మందితో GRMB కార్యాలయాన్ని ముట్టడిస్తామని హరీశ్‌రావు హెచ్చరించారు. కేంద్రం, ఏపీ సీఎం చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కలిసి తెలంగాణకు చేస్తున్న "జల ద్రోహాన్ని" అడ్డుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

# కేటీఆర్ చెప్పే రూ.200 కోట్లు ఎక్కడివి?

హైదరాబాద్,12 ఆగస్టు (ఇది కద నిజం): నగరంలో భూ కేటాయింపుల వ్యవహారంపై అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన ఆరోపణలపై మంత్రి శ్రీధర్‌బాబు తీవ్రంగా స్పందించారు. కేటీఆర్ చెబుతున్న రూ.200 కోట్ల లెక్కలు ఎక్కడి నుంచి వచ్చాయో చెప్పాలని డిమాండ్ చేశారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎకరా భూమిని రూ.90 లక్షలకే కేటాయించారని శ్రీధర్‌బాబు తెలిపారు. తమ ప్రభుత్వం మాత్రం నిబంధనల ప్రకారం ఎకరాకు రూ.1.5 కోట్ల చొప్పున కేటాయించిందని స్పష్టం చేశారు. ఐదు ఎకరాల భూమిని మొత్తం రూ.7.5 కోట్లకు కేటాయించామని చెప్పారు. అలాంటప్పుడు కేటీఆర్ చెబుతున్న రూ.200 కోట్ల లెక్కలకు ఆధారం ఏమిటో వెల్లడించాలని ప్రశ్నించారు.

అసత్య ప్రచారంతో ప్రజలను పక్కదోవ పట్టించవద్దని కేటీఆర్‌కు మంత్రి సూచించారు. హిల్ట్ పాలసీతో హైదరాబాద్ ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని, పారిశ్రామికవేత్తలను భయపెట్టడం, రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవడం సరికాదని హితవు పలికారు.

నీటి వాటాలపై రాజీ లేదు

తెలంగాణ నీటి వాటాల విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడబోమని శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. జీఆర్ఎంబీ సమావేశానికి హాజరై రాష్ట్రానికి రావాల్సిన నీటి వాటాల కోసం బలంగా వాదిస్తామని తెలిపారు. తెలంగాణ ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తుందని పేర్కొన్నారు.

# మంత్రి లోకేష్ రాజీనామా చేయాలి..



అమరావతి,12 ఆగస్టు (ఇది కద నిజం): ఆంధ్రప్రదేశ్‌లో డీఎస్సీ అక్రమాలపై రగడ కొనసాగుతూనే ఉంది. డీఎస్సీ లీకేజీలు, అక్రమాలపై గత 74 రోజులుగా దాదాపు 10 రకాల కార్యక్రమాలు నిర్వహించామని వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. డీఎస్సీ వ్యవహారంపై బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే అక్రమాలకు సంబంధించిన ఆధారాలు, సాక్ష్యాలను ప్రజల ముందుంచామని పేర్కొన్నారు.డీఎస్సీలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగికే ఫస్ట్ ర్యాంకు రావడం, మెరిట్ లిస్టులు మారిన వ్యవహారాలు వెలుగులోకి రావడం వంటి అంశాలను జగన్ ప్రస్తావించారు. డీఎస్సీ లీకేజీ ఎంత దూరం వెళ్లిందో పూర్తిగా తేలాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో జరిగే విచారణతో వాస్తవాలు వెలుగులోకి వస్తాయా అని ప్రశ్నించిన జగన్.. డీఎస్సీ అక్రమాలపై కచ్చితంగా సీబీఐ దర్యాప్తు జరగాల్సిందే అని డిమాండ్ చేశారు.

స్పోర్ట్స్ కోటాపైనా ఆరోపణలు

స్పోర్ట్స్ కోటా పేరుతో జీవోలు జారీ చేసి అక్రమాలకు తెరతీశారని జగన్ ఆరోపించారు. డీఎస్సీ పరీక్ష రాయకుండానే, పోటీ పరీక్ష లేకుండానే ఉద్యోగాలు ఇచ్చే పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. ఆ తర్వాత జీవోలు మార్చడం ద్వారా ప్రభుత్వం గత నిర్ణయం తప్పని పరోక్షంగా అంగీకరించినట్లేనని అన్నారు. ఇన్ని ఆరోపణలు, ఆధారాలు ఉన్న నేపథ్యంలో విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాల్సిందేనని స్పష్టం చేశారు.విద్యాశాఖ మంత్రి చంద్రబాబు కుమారుడే అయినప్పుడు రాష్ట్ర ప్రభుత్వ విచారణలో నిష్పాక్షికత ఎలా ఉంటుందని జగన్ ప్రశ్నించారు. సీబీఐ విచారణ ద్వారానే అసలు వాస్తవాలు బయటపడతాయని అన్నారు.

రూ.12,400 కోట్ల ఫీజు బకాయిలు

ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన పథకాల బకాయిలపైనా జగన్ ప్రభుత్వాన్ని విమర్శించారు. 13 త్రైమాసికాలుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, ఒక్కో త్రైమాసికానికి సుమారు రూ.700 కోట్ల చొప్పున రూ.9,100 కోట్లు బకాయిలు ఉన్నాయని తెలిపారు. వసతి దీవెన కింద మరో రూ.3,300 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. రెండు పథకాలకు కలిపి సుమారు రూ.12,400 కోట్లు చెల్లించాల్సి ఉండగా.. ప్రభుత్వం ఇప్పటివరకు రూ.2,900 కోట్లు మాత్రమే ఇచ్చిందని ఆరోపించారు.

బీసీ విద్యార్థుల భవిష్యత్తుకు కీలకమైన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. బకాయిలపై శాసనమండలిలో ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీయాలని పార్టీ సభ్యులకు జగన్ సూచించారు.

రైతుల సమస్యలపైనా పోరాటం

రాష్ట్రంలో రైతులు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారని జగన్ అన్నారు. ఏ పంటకూ గిట్టుబాటు ధర లభించడం లేదని ఆరోపించారు. పంటలు వేసుకోవాలని చెప్పి రైతులు పెట్టుబడులు పెట్టిన తర్వాత సాగునీరు ఇవ్వలేమని ప్రభుత్వం చెబుతోందని విమర్శించారు. రైతులకు అండగా ఉన్న ఉచిత పంటల బీమాను ఎత్తివేశారని, ఇన్‌పుట్ సబ్సిడీ విధానానికీ ప్రభుత్వం మంగళం పాడిందని ఆరోపించారు. రైతుల సమస్యలపై కూడా శాసనమండలిలో గట్టిగా పోరాడాలని పార్టీ సభ్యులకు జగన్ దిశానిర్దేశం చేశారు. డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ, మంత్రి రాజీనామా, విద్యార్థుల ఫీజు బకాయిల చెల్లింపు, రైతుల సమస్యల పరిష్కారం వంటి అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని పిలుపునిచ్చారు.

# చంద్రబాబుది సొంత డబ్బా!

మొదటి పేజీ తరువాయి



నిరుద్యోగం, వ్యవసాయం, శాంతిభద్రతలు, విద్యుత్ చార్జీలు, పెట్టుబడులు, పోలవరం వంటి అంశాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని షర్మిల డిమాండ్ చేశారు. రైతులకు పంటలకు మద్దతు ధర, ప్రభుత్వ మద్దతు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను పట్టించుకోకుండా కేవలం వృద్ధిరేటు గురించి గొప్పలు చెప్పుకోవడం సరికాదన్నారు.

పోలవరం ప్రాజెక్టు ఎత్తును 41.5 మీటర్లకు పరిమితం చేస్తూ దాన్ని ఘనకార్యంగా ప్రచారం చేసుకోవడంపై కూడా షర్మిల ప్రశ్నలు సంధించారు. భవిష్యత్తులో ఈ ఎత్తుతో పోలవరం ద్వారా కలిగే ప్రయోజనాలేమిటో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

పెట్టుబడులపై పారదర్శకత ఏది?

గత రెండేళ్లలో లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ.. వాటిలో ఎన్ని ప్రాజెక్టులు వాస్తవంగా భూమిపైకి వచ్చాయో వెల్లడించాలని షర్మిల కోరారు. ఆయా ప్రాజెక్టులకు భూమి, నీరు, విద్యుత్, ఇతర మౌలిక వసతుల కల్పనపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ చార్జీలు, శాంతిభద్రతలు, విద్యార్థుల సమస్యలు సహా అనేక అంశాలపై ప్రజల్లో ఆందోళనలు ఉన్నాయని షర్మిల పేర్కొన్నారు. ఇవి తన వ్యక్తిగత విమర్శలు కావని, ప్రజలు లేవనెత్తుతున్న ప్రశ్నలేనని స్పష్టం చేశారు.

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
గురువారం 13-08-2026

# గణేష్ నగర్, రంగారెడ్డి నగర్‌లలో వైభవంగా అమ్మవారి ఫలారం బండి ఊరేగింపు

## ● పాల్గొన్న బీజేపీ నాయకులు నల్ల జై శంకర్ గౌడ్






ఇది కద నిజం,కుత్బుల్లాపూర్: గణేష్ నగర్, రంగారెడ్డి నగర్ డివిజన్లలో అమ్మవారి ఫలారం బండి ఊరేగింపు కార్యక్రమాలు భక్తిశ్రద్ధలు, ఆధ్యాత్మిక ఉత్సాహం మధ్య వైభవంగా జరిగాయి. ఈ పండుగ వేడుకల్లో బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా నాయకులు నల్ల జై శంకర్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మన సంస్కృతి, సాంప్రదాయాలు మరియు ఆధ్యాత్మిక విశ్వాసాలకు ప్రతీకగా నిలిచే ఇలాంటి పండుగలు ప్రజలందరిలో ఐక్యతను, భక్తిభావాన్ని మరింత పెంపొందిస్తాయని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. గణేష్ నగర్‌లో శరత్ మరియు శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫలారం బండి ఊరేగింపు కార్యక్రమంలో నల్ల జై శంకర్ గౌడ్ బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా నూతన అధ్యక్షులు గిరి వర్ధన్ రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఉమ్మడిగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు ఆచరించారు. అనంతరం రంగారెడ్డి నగర్‌లో బీజేపీ రాష్ట్ర వాదీజ సెల్ జనరల్ సెక్రటరీ నందనం దివాకర్ ఆధ్వర్యంలో జరిగిన ఊరేగింపులో కూడా పాల్గొని వేడుకలను పర్యవేక్షించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో స్థానిక భక్తులు, మహిళలు, యువత మరియు పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ఘనంగా మొక్కులు చెల్లించుకున్నారు. ఈ ఊరేగింపుల్లో బీజేపీ నాయకులు కట్ట కుమార్, పులి బలరాంతో పాటు పలువురు పార్టీ కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు. గణేష్ నగర్, రంగారెడ్డి నగర్ ప్రజలందరిపై అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ఐశ్వర్యంతో వర్ధిల్లాలని నల్ల జై శంకర్ గౌడ్ ఆకాంక్షించారు.

# కుక్కునూరులో ఘనంగా ఏఐఎస్‌ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



ఇది కద నిజం, కుక్కునూరు: అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) 91వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను కుక్కునూరు మండలంలో ఘనంగా నిర్వహించారు. మండల కమిటీ అధ్యర్యంలో బుధవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మండల కార్యదర్శి సారంగి శౌర్య జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యారంగంలో నెలకొన్న సమస్యలపై విద్యార్థి సంఘాలు పోరాడాలని పిలునిచ్చారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని విద్యా సంస్థల్లో మౌలిక వసతుల కల్పినకు ఏఐఎస్ఎఫ్ పాటుపడుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ్, ప్రేమ్ చరణ్, సాయికిరణ్, యూజాఇఫ్, రామ్ చరణ్, వెంకన్నబాబు, రవీంద్ర, నాగచైతన్య, బిట్టు, సీపీఐ కుక్కునూరు మండల కార్యదర్శి కొన్నె లక్ష్మయ్య, ఏపీ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా అధ్యక్షురాలు వరకా శ్యామల, మైసాక్షి వెంకటాచారి పాల్గొన్నారు.

# నేడు కుత్బుల్లాపూర్‌లో భారీ తిరంగా ర్యాలీ

## ● విజయవంతం చేయాలని బీజేపీ నాయకుల పిలుపు




ఇది కద నిజం,కుత్బుల్లాపూర్: భారతీయ జనతా యువమోర్చా మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో నిర్వహించనున్న 'తిరంగా ర్యాలీ'ని విజయవంతం చేయాలని బీజేపీ నాయకులు పిలుపునిచ్చారు. దేశభక్తి, జాతీయ ఐక్యతను చాటేలా చేపట్టే ఈ ర్యాలీలో నియోజకవర్గంలోని బీజేపీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు మరియు యువత పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ ర్యాలీ ఆగస్టు 13న మధ్యాహ్నం 2:30 గంటలకు ఐడీపీఎల్ ఎక్స్ రోడ్స్ నుండి ప్రారంభమై, కుత్బుల్లాపూర్ మున్సిపల్ సర్కిల్ కార్యాలయం వరకు కొనసాగనుంది. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షులు డి. గిరి వర్ధన్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొననున్నారు. వారితో పాటు మాజీ కార్పొరేటర్లు, ముఖ్య నాయకులు, పార్టీ శ్రేణులు ఈ ర్యాలీలో భాగస్వాములు కానున్నారు. ర్యాలీ ఏర్పాట్లపై బీజేపీ నాయకులు వేముల రమేష్, పులి బలరాం, మణి, రావుల పృథ్వీ, నాగదీప్ గౌడ్, విజయ్, నల్ల జై శంకర్ గౌడ్ తదితరులు మాట్లాడారు. ఈ ర్యాలీకి సుమారు 500 మందికి పైగా హాజరయ్యేలా విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ర్యాలీని పూర్తిగా శాంతియుతంగా, క్రమశిక్షణతో నిర్వహిస్తామని.. ట్రాఫిక్ నిబంధనలు, పోలీసుల సూచనలు మరియు ప్రభుత్వ నిబంధనలను తూచా తప్పకుండా పాటిస్తూ కార్యక్రమాన్ని దిగ్విజయం చేస్తామని నాయకులు స్పష్టం చేశారు. "దేశభక్తిని చాటుదాం -- తిరంగాను గౌరవిద్దాం" అనే నినాదంతో సాగే ఈ మహోజ్వల ర్యాలీలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా బీజేపీ నాయకత్వం పిలుపునిచ్చింది.

# అయినవాళ్లు ఉన్నా..

# అనాథగా వృద్ధుడి దైన్యస్థితి!



ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్: అయినవాళ్లు ఉన్నప్పటికీ ఓ వృద్ధుడు అనాథగా మారి దిక్కుతోచని స్థితిలో జీవిస్తున్న ఘటన వెలుగులోకి వచ్చింది. నిజామాబాద్ జిల్లా చందూర్ గ్రామానికి చెందిన చందయ్య కొంతకాలంగా వేల్పూర్ మండలం జానకంపేటలో భిక్షాటన చేస్తూ కాలం వెళ్లదీస్తున్నాడు. మూడు రోజులుగా తిండిలేక అనారోగ్యంతో బాధపడుతున్న చందయ్యకు గ్రామ పెద్దలు సొసైటీ ఆవరణలో తాత్కాలికంగా ఆశ్రయం కల్పించారు. కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి సమాచారం అందించినా స్పందన లేకపోవడంతో వృద్ధుడి పరిస్థితి మరింత దయనీయంగా మారింది. "నన్ను ఎలాగైనా నా స్వగ్రామం చందూరుకు చేర్చండి" అంటూ చందయ్య కన్నీటి పర్యంతమవుతూ వేడుకోవడం పలువురిని కదిలించింది. వృద్ధుడిని ఆదుకుని స్వగ్రామానికి చేర్చేందుకు దాతలు, అధికారులు ముందుకు రావాలని స్థానికులు కోరుతున్నారు.

# గ్రామ స్వరాజ్యంతోనే గ్రామాల సమగ్ర అభివృద్ధి

## ● జై స్వరాజ్ పార్టీ అధినేత కాసాని శ్రీనివాసరావు గౌడ



ఇది కద నిజం,రంగారెడ్డి, ఆగస్టు 12: గ్రామాల అభివృద్ధి, స్థానిక పరిపాలనలో ప్రజల భాగస్వామ్యం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం లక్ష్యంగా జై స్వరాజ్ పార్టీ చేపట్టిన "గ్రామ స్వరాజ్యం మహా సంకల్ప బైక్ యాత్ర" ప్రచారంలో భాగంగా జై స్వరాజ్ పార్టీ అధినేత శ్రీ రాజయోగి కాసాని శ్రీనివాసరావు గౌడ ఈ రోజు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ బి. నారాయణ రెడ్డిను కలిసి యాత్రకు సంబంధించిన కరపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ స్వరాజ్య ఉద్యమం యొక్క లక్ష్యాలు, ఉద్దేశాలు, ప్రజల ఆకాంక్షలు, గ్రామీణ ప్రాంతాల్లో ఎదురవుతున్న సమస్యలు, స్థానిక స్థాయిలోనే వాటికి పరిష్కారాలు చూపాల్సిన అవసరం తదితర అంశాలను కలెక్టర్‌కు కాసాని శ్రీనివాసరావు గౌడ వివరించారు. గ్రామాలే దేశానికి పునాది ఈ సందర్భంగా కాసాని శ్రీనివాసరావు గౌడ మాట్లాడుతూ, దేశ అభివృద్ధికి గ్రామాలే పునాదులని, గ్రామాలు బలపడితేనే రాష్ట్రం, దేశం ఆర్థికంగా మరియు సామాజికంగా బలోపేతం అవుతాయని అన్నారు. గ్రామాల అభివృద్ధి కోసం తీసుకునే నిర్ణయాల్లో గ్రామ ప్రజలకు మరింత భాగస్వామ్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల అవసరాలు, స్థానిక వనరులు, గ్రామీణ ఉపాధి అవకాశాలు, రైతులు, మహిళలు, యువత, వృత్తిదారులు, అసంఘటిత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను గ్రామ స్థాయిలోనే గుర్తించి పరిష్కరించే విధంగా పరిపాలన ఉండాలని ఆయన పేర్కొన్నారు. "గ్రామం తన అవసరాలను తానే గుర్తించుకుని, తన వనరులను తానే సద్వినియోగం చేసుకుని, తన అభివృద్ధికి తానే ప్రణాళిక రూపొందించుకునే విధానమే నిజమైన గ్రామ స్వరాజ్యం" అని కాసాని శ్రీనివాసరావు గౌడ అన్నారు.

### గ్రామ స్వరాజ్ మహా సంకల్ప బైక్ యాత్ర

తెలంగాణలోని గ్రామాలన్నింటినీ గ్రామ స్వరాజ్య ఉద్యమంతో అనుసంధానం చేయాలనే లక్ష్యంతో గ్రామ స్వరాజ్ మహా సంకల్ప బైక్ యాత్రను చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ యాత్రలో భాగంగా సర్పంచులు, ప్రజాప్రతినిధులు, రైతులు, మహిళలు, యువత, కార్మికులు, గ్రామీణ వృత్తిదారులు, మేధావులు, సామాజిక కార్యకర్తలు, వివిధ వర్గాల ప్రజలను కలిసి వారి సమస్యలు, సూచనలు, అభిప్రాయాలను తెలుసుకుంటామని చెప్పారు. గ్రామాల నుంచి వచ్చే సూచనలను సమీకరించి ప్రజల ఆకాంక్షలకు అనుగుణమైన గ్రామ స్వరాజ్య విధానాన్ని రూపొందించడమే ఉద్యమం ప్రధాన లక్ష్యమని ఆయన వివరించారు. స్థానిక వనరులతో స్థానిక ఉపాధిగ్రామాల్లో ఉన్న సహజ వనరులు, వ్యవసాయం, పశుపోషణ, గ్రామీణ వృత్తులు, కుటీర పరిశ్రమలు, మహిళా సంఘాలు, యువత నైపుణ్యాలను ఉపయోగించుకుని స్థానికంగా ఉపాధి అవకాశాలు పెంచాల్సిన అవసరం ఉందని కాసాని శ్రీనివాసరావు గౌడ అన్నారు. గ్రామాల్లోనే ఉపాధి అవకాశాలు పెరిగితే యువత వలసలు తగ్గుతాయని, గ్రామీణ కుటుంబాల ఆదాయం పెరుగుతుందని, స్థానిక ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని పేర్కొన్నారు.

### ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామ స్వరాజ్యం

గ్రామ స్వరాజ్యం కేవలం ప్రభుత్వ పథకాలతో సాధ్యమయ్యే అంశం కాదని, ప్రజల భాగస్వామ్యం, స్థానిక సంస్థల బలోపేతం, బాధ్యతాయుతమైన పరిపాలన, పారదర్శకత కలిసినప్పుడే నిజమైన గ్రామ స్వరాజ్యం సాధ్యమవుతుందని కాసాని శ్రీనివాసరావు గౌడ అన్నారు."గ్రామాన్ని మార్చే శక్తి గ్రామ ప్రజలలోనే ఉంది. ఆ శక్తిని సంఘటితం చేసి గ్రామాభివృద్ధికి ఉపయోగించడమే గ్రామ స్వరాజ్య ఉద్యమం లక్ష్యం" అని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌కు గ్రామ స్వరాజ్ మహా సంకల్ప బైక్ యాత్రకు సంబంధించిన కరపత్రాన్ని అందజేసి, యాత్ర ఉద్దేశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జై స్వరాజ్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జనగాం వెంకటేష్ గౌడ్, రంగారెడ్డి జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు నాగమణితో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. "మన గ్రామం -- మన ప్రణాళిక -- మన పాలన -- మన స్వరాజ్యం" అనే నినాదంతో గ్రామ స్వరాజ్య ఉద్యమాన్ని మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లనున్నట్లు జై స్వరాజ్ పార్టీ నాయకులు తెలిపారు.

# అనాథ పిల్లల మధ్య ఘనంగా శ్రియ జన్మదిన వేడుకలు



ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా కోటగిరి: నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం ఎక్లాస్పూర్‌లోని అనాథ పిల్లల మధ్య కామారెడ్డి జిల్లా పిట్లం మండలంలోని గౌరారం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జూపాల శంకర్ కూతురు లావణ్య అంబయ్య కూతురు శ్రియ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.

శ్రియ జన్మదినాన్ని పురస్కరించుకుని అనాథ పిల్లలకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేసి ఆప్యాయతను పంచుకున్నారు. జన్మదిన వేడుకలను నిరుపేద, అనాథ పిల్లల మధ్య జరుపుకోవడం ద్వారా మానవత్వాన్ని చాటుకున్నారు. పిల్లలతో కలిసి ఆనందంగా గడిపి, వారి ముఖాల్లో చిరునవ్వులు నింపారు. జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమంగా నిర్వహించడం పలువురి ప్రశంసలు అందుకుంది. ఈ కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులు అనాథ ఆశ్రమా పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

# చైన్ స్నాచింగ్ కేసును ఛేదించిన కుక్కునూరు పోలీసులు

**- నిందితుల నుంచి బంగారు తాడు, కారు స్వాధీనం**

**- సీఐ, ఎస్సైను అభినందించిన ఎస్పీ కే ప్రతాప్ శివకిశోర్**



ఇది కద నిజం, కుక్కునూరు: కుక్కునూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని వింజరం గ్రామ శివారున రోడ్డుపై వెళుతున్న ఓ వృద్ధ మహిళపై దాడి చేసి, ఆమె మెడలో ఉన్న బంగారు నానుతాడును బలవంతంగా లాక్కొని పారిపోయిన సంఘటనకు సంబంధించిన కేసును పోలీసులు 72 గంటల్లో ఛేధించారు. ఆ కేసులో నలుగురు నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి బంగారు నాన్ తాడు, కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు వివరాలను ఎస్సై రాజారెడ్డి బుధవారం మీడియకు వెల్లడించారు. దోపిడికి గురైన వింజరం గ్రామానికి చెందిన వసుమతి అనే మహిళ 9వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేసిందని చెప్పారు. అప్పటి నుంచి కేసు దర్యాప్తు చేస్తుండగా, బుధవారం ఉదయం మండలంలోని వెంకటాపురం గ్రామం నుంచి తిమ్మంపేటకు వెళ్లే అడ్డరోడ్డు వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న జంగారెడ్డిగూడెం మండలానికి చెందిన షేక్ ఖాసిం, వాసంశెట్టి రామచంద్ర పవన్, నలుబోలు లోకేష్ అనే ముగ్గురు పురుషులు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలానికి చెందిన పాయం రుతు అనే మహిళను గుర్తించామని ఆయన తెలిపారు. పోలీసులను చూసి వారు అక్కడి నుండి పారిపోవడానికి ప్రయత్నించగా, వెంబడించి అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ వివరించారు. అరెస్ట్ అయిన వారిలో షేక్ ఖాసింపై పలు పోలీస్ స్టేషన్లలో 17 కేసులు, వాసంశెట్టి రామచంద్ర పవన్ కుమార్ పేరు మీద 10 కేసులు, నలుబోలు లోకేష్ అనే వ్యక్తిపై మూడు కేసులు ఉన్నట్టు ఎస్సై రాజారెడ్డి వెల్లడించారు.

అలాగే, నిందితులు TS 03 ET 4530 నంబరు గల తెలుపు రంగు మారుతి సుజుకి కారులో ప్రయాణిస్తూ, డబ్బుల అవసరం కాగా దొంగతనం చేయాలని నిర్ణయించుకున్నారని, ఈ క్రమంలో కుక్కునూరు మీదుగా వింజరం గ్రామానికి చేరుకొని ఒంటరిగా నడుచుకుంటూ వెళుతున్న వృద్ధ మహిళను గుర్తించి, కారును ఆపి ఆమెను అడ్డగించారని ఆయన తెలిపారు. అనంతరం నిందితులు ఆమెను బెదిరించి, దాడి చేసి, ఆమె మెడలో ఉన్న సుమారు మూడు కాసుల బంగారు నానుతాడును బలవంతంగా లాక్కున్నారని, ఈ ఘటనను చూసీ అడ్డుకునేందుకు ప్రయత్నించిన ఆమె అల్లుడిని కూడా తోసివేసి, చంపేస్తామని బెదిరించి అక్కడి నుండి కారులో పారిపోయారని ఎస్సై వెల్లడించారు. ఆ క్రమంలో నిందితులు ప్రయాణిస్తున్న కారు వెంకటాపురం గ్రామం తిమ్మంపేట రోడ్డు వైపు వెళ్తుండగా అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొందని అన్నారు. దీంతో నిందితులు కారును సమీపంలోని అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లి దాచిపెట్టి, అక్కడి నుండి పరారైనట్లు దర్యాప్తులో వెల్లడైందని ఆయన వివరించారు. ఇక, నిందితుల నుంచి బంగారు నానుతాడును, కారును స్వాధీనం చేసుకున్నామని ఆయన పేర్కొన్నారు. కేసులో నలుగురు నిందితులను బుధవారం ఉదయం జంగారెడ్డిగూడెం కోర్టులో హాజరు పరచగా.. న్యాయమూర్తి రిమాండ్ విధించడంతో జైలుకు తరలించినట్లు ఎస్ఐ రాజారెడ్డి వెల్లడించారు.

### కుక్కునూరు పోలీసులను అభినందించిన ఎస్పీ

కేసు దర్యాప్తులో చురుకుగా వ్యవహరించి, నిందితులను త్వరితగతిన అరెస్ట్ చేసి, దొంగిలించబడిన బంగారు నానుతాడు, నేరానికి ఉపయోగించిన వాహనాన్ని స్వాధీనం చేసుకున్న కుక్కునూరు సీఐ కుక్కునూరు బాల సురేష్ బాబును, ఎస్సై రాజా రెడ్డిని, పోలీసు సిబ్బందిని ఎస్పీ కే ప్రతాప్ శివకిశోర్ ప్రత్యేకంగా అభినందించారు.

# సర్వాయి పాపన్న జీవితం అందరికీ ఆదర్శప్రాయం: తీగుళ్ళ పద్మారావు గౌడ్



ఇది కద నిజం, సికింద్రాబాద్: బహుజనులలో ఆత్మస్థైర్యాన్ని నింపి, సమాజానికి ఆదర్శప్రాయుడిగా నిలిచిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న అని సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుళ్ళ పద్మారావు గౌడ్ కొనియాడారు. పాపన్న వెనుకబడిన తరగతుల జాతిరత్నమని ఆయన కితాబు ఇచ్చారు. సర్దార్ సర్వాయి పాపన్న జీవిత చరిత్ర ఆధారంగా రూపొందుతున్న చలనచిత్రంలోని ఒక ప్రత్యేక గీతాన్ని బుధవారం సికింద్రాబాద్‌లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పద్మారావు గౌడ్ ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటి రోజుల్లోనే ప్రజల్లో సామాజిక చైతన్యాన్ని రగిలించి, తన అద్వితీయ పోరాట పటిమతో సర్వాయి పాపన్న అందరినీ సంఘటితం చేసిన తీరు ప్రశంసనీయమని పేర్కొన్నారు. అణచివేతపై తిరగబడిన ఆయన ధైర్యసాహసాలు ఎందరికో స్ఫూర్తిదాయకమన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న జీవిత విశేషాలను, ఆయన ఆశయాలను భావి తరాలకు చాటిచెప్పాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని, తద్వారా యువతలో మంచి స్ఫూర్తిని నింపవచ్చని పద్మారావు గౌడ్ అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో చలనచిత్ర నిర్మాత లింగంపల్లి వెంకటేశ గౌడ్, రంగస్థల ప్రముఖుడు రామకృష్ణా గౌడ్ లతో పాటు పలువురు ముఖ్య నాయకులు, చిత్ర బృందం సభ్యులు పాల్గొన్నారు.

# ఆటో కార్మికులతో పెట్టుకున్న ప్రభుత్వాలు బతికి బట్టకట్టలేవు

- ఆర్టీసీలో ఎలక్ట్రిక్ ఆటోల ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలి
- లేదంటే 5 లక్షల మంది ఆటో డ్రైవర్లు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పాతర పెడ్తరు
- టీఆర్టీయూ అనుబంధ ఆటో కార్మికుల సంఘం నాయకుల హెచ్చరిక
- ధర్నా చౌక్ లో డ్రైవర్ల దీక్ష.. మహాధర్నా







ఇది కద నిజం ,హైదరాబాద్ :

ఆటో కార్మికులతో పెట్టుకున్న ఏ ప్రభుత్వానికి కూడా బతికి బట్టకట్టిన చరిత్ర లేదని తెలంగాణ రక్షణ సేన కార్మిక విభాగం టీఆర్టీయూ నేతలు అన్నారు. ఆర్టీసీలో ఎలక్ట్రిక్ ఆటోలు నడిపించాలన్న నిర్ణయం ఆటో కార్మికుల జీవితాలను ఆగం చేస్తుందన్నారు. వెంటనే ఈ ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలని కోరుతూ తెలంగాణ రక్షణ ట్రేడ్ యూనియన్ (టీఆర్టీయూ) అనుబంధ ఆటో కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ ధర్నా చౌక్ లో బుధవారం మహాధర్నా నిర్వహించారు. ఆటో కార్మికులకు అన్యాయం చేసే 263 జీవో రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ 20 మంది ఆటో కార్మికులు దీక్ష చేశారు. ప్రభుత్వం ఆటో డ్రైవర్ల పొట్టకొడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

**ఆటో డ్రైవర్లతో పెట్టుకుంటే పుట్టగతులుండవు– రూప్ సింగ్**

రేవంత్ రెడ్డి సర్కార్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఆటో డ్రైవర్ల జీవితాలతో చెలగాటమాడుతోందని టీఆర్ఎస్ సీనియర్ నేత రూప్ సింగ్ మండిపడ్డారు. ఫ్రీ బస్సు పేరుతో ఈ ప్రభుత్వం ఆటో డ్రైవర్ల పొట్టకొట్టిందని విమర్శించారు. అయినప్పటికీ ప్రభుత్వానికి భారం కాకుండా వారి బతుకేదో వారు బతుకుతున్నారన్నారు. అలాంటి ఆటో డ్రైవర్ల జీవితాలపై పిడుగు వేసినట్లు ఆర్టీసీ ఆధ్వర్యంలో ఎలక్ట్రిక్ ఆటోలు నడపాలని నిర్ణయించటం సరికాదన్నారు. ఆటో డ్రైవర్లతో పెట్టుకున్న ఏ ప్రభుత్వం కూడా బతికి బట్టకట్టలేదని, రేవంత్ సర్కార్ కు కూడా అదే గతి పడుతుందన్నారు. వెంటనే ఎలక్ట్రిక్ ఆటోల నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆటో డ్రైవర్లు పాతరేస్తారని హెచ్చరించారు.

**ఆటో డ్రైవర్లకు అన్యాయం జరిగితే ఊరుకోం – బోడ జనార్ధన్**

రాష్ట్ర వ్యాప్తంగా 5 లక్షల మంది ఆటో డ్రైవర్లు ఉన్నారని, వారికి అన్యాయం చేస్తే ఎట్టి పరిస్థితుల్లో ఊరుకునేది లేదని టీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి బోడ జనార్ధన్ హెచ్చరించారు. ఎలక్ట్రిక్ ఆటోలను ఆర్టీసీ ఆధ్వర్యంలో నడపాలని నిర్ణయించటం సరికాదన్నారు. ఆటో డ్రైవర్ల కు మంచి చేయకపోయినా సరే చెడు చేసే కార్యక్రమాలు వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆటోడ్రైవర్లకు అన్యాయం చేసే జీవో 263 ను వెంటనే రద్దు చేయాలని టీఆర్ఎస్ సీనియర్ నేతలు ఆర్.వి. ఆర్ ప్రసాద్, నరేష్ ప్రజాపతి డిమాండ్ చేశారు. ప్రభుత్వంపై చేసే ఈ పోరాటంలో ఆటో డ్రైవర్లంతా ఐక్యంగా పోరాటం చేయాలన్నారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు పడాల మనోజ గౌడ్, వీరన్న తో పాటు ఆటో యునియన్ నాయకులు ఎం. ఎ సలీం, నజీరోద్దీన్, మహేందర్ నాయక్, శ్రీధర్, శివ ప్రసాద్, అబ్దుల్ గని, టీఆర్టీయూ నాయకులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

# మతోన్మాద బీజేపీ వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

### - యర్రంశెట్టి నాగేంద్రరావు, యర్నం సాయికిరణ్



ఇది కద నిజం, కుక్కునూరు: మతోన్మాద భారతీయ జనతా పార్టీ వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు యర్రంశెట్టి నాగేంద్రరావు, సీపీఎం మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ పిలుపునిచ్చారు. కుక్కునూరు సుందరయ్య భవనం ప్రజాసంఘాల కార్యాలయంలో సీపీఎం ఆధ్వర్యంలో కామ్రేడ్ సీతారాం ఏచూరి 74వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు యర్రంశెట్టి నాగేంద్రరావు, సీపీఎం మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. సీతారాం ఏచూరి గారు విద్యార్థి ఉద్యమం నుంచి జాతీయ రాజకీయాల వరకు ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సామాజిక న్యాయం, శాస్త్రీయ ఆలోచనల పరిరక్షణ కోసం నిరంతరం పోరాడారని తెలిపారు. మతోన్మాద రాజకీయాలను, ప్రజలను మతాల పేరుతో విభజించే విధానాలను ఆయన తీవ్రంగా వ్యతిరేకించారని అన్నారు. బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న మతోన్మాద, ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్య, లౌకిక శక్తులను ఐక్యం చేసేందుకు సీతారాం ఏచూరి చేసిన కృషి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ప్రజలు శాస్త్రీయ ఆలోచనలతో ముందుకు సాగుతూ మూఢనమ్మకాలు, మతోన్మాదానికి వ్యతిరేకంగా నిలవాలని, కార్మికులు, రైతులు, పేదలు, విద్యార్థులు, యువత ఎదుర్కొంటున్న సమస్యలపై ఐక్యంగా పోరాడాలని సీపీఎం నాయకులు పిలుపునిచ్చారు. సీతారాం ఏచూరి ఆశయాలను ఆచరణలో కొనసాగిస్తూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడటమే ఆయనకు నిజమైన నివాళి అని నాగేంద్రరావు, సాయి కిరణ్ అన్నారు. ఈ కార్యక్రమంలో కారం రమేష్, దారా కృష్ణ, కాకా కిషోర్, పాంచాలి, తదితరులు పాల్గొన్నారు.

# శాంతిభద్రతలపై సీఎం చంద్రబాబు కీలక సమీక్ష...

**మహిళల, చిన్నారుల రక్షణకు ప్రాధాన్యత...**
**సైబర్, గంజాయి నేరాలపై ఉక్కుపాదం...**
**పోలీసులతో విడియో కాన్ఫరెన్స్.....**



మండపేట (ఇది కద నిజం) ఆగస్టు :12

రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు సంబంధించి ఆగ,స్టు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగిన ఈ సమీక్షలో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 1,650 మంది పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఈ సమావేశంలో హోంమంత్రి వంగలపూడి అనిత, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, అన్ని జిల్లాల ఐజీలు, డీఐజీలు, ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు హాజరయ్యారు. మండపేట రూరల్ సర్కిల్ అధికారులు కూడా వీడియో ద్వారా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు పలు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు. మహిళలు, చిన్నారులపై జరుగుతున్న నేరాలను కట్టడి చేయడంలో పోలీసులు మరింత కఠినంగా వ్యవహరించాలని సూచించారు. పెరుగుతున్న సైబర్ నేరాలను అరికట్టడానికి ఆధునిక టెక్నాలజీని వినియోగించాలని, బ్లేడ్ బ్యాచ్‌లు, గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు.

అలాగే సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న తప్పుడు ప్రచారాలు, పుకార్లను వెంటనే గుర్తించి నియంత్రించాలని స్పష్టం చేశారు. నమోదైన కేసుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని, ప్రజలకు వేగంగా, సమర్థవంతంగా పోలీసింగ్ సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

శాంతిభద్రతలను ఏ మాత్రం విస్మరించకుండా రాష్ట్రంలో ప్రజలకు భరోసా కల్పించాలని ముఖ్యమంత్రి ఈ సమావేశంలో స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. రూరల్ సీఐ పి దొర రాజు, ఎస్ ఐ లు ఈ విడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు.

# కార్యకర్తలే పార్టీకి ప్రాణవాయువు... గ్రామానికి 10 మందికి ఉపాధి.!!

### ప్రజా సమస్యల తక్షణ పరిష్కారమే ధ్యేయం ఇన్చార్జ్ చమర్తి జగన్



ఇది కద నిజం న్యూస్ కడపజిల్లా ఆగస్టు 12:రాజంపేట నియోజకవర్గం..ఒంటిమిట్ట మండలం రాచగుడిపల్లి పంచాయతీ నందు నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు, రాజంపేట అబ్జర్వర్ భీమినేని చిట్టిబాబుతో కలిసి స్థానిక మండల నాయకులు, కార్యకర్తలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి యూనిట్, మండల స్థాయి కమిటీల ఏర్పాటును 3 నుండి 4 రోజుల్లోగా పూర్తి చేయాలని నాయకులను ఆదేశించారు. గతంలో పలు నియోజకవర్గాల్లో పనిచేసిన సుదీర్ఘ అనుభవం ఉన్న అబ్జర్వర్ భీమినేని చిట్టిబాబు పర్యవేక్షణ పార్టీకి ఎంతో తోడ్పడుతుందని తెలిపారు. ప్రతి గ్రామంలోనూ కనీసం 10 మంది క్రియాశీల కార్యకర్తలను ఎంపిక చేసి, వారికి ప్రభుత్వం అందిస్తున్న హార్టికల్చర్, డ్వాక్రా మరియు ఇతర స్వయం ఉపాధి పథకాలు, రుణ అవకాశాలపై అవగాహన కల్పిస్తామని చమర్తి వెల్లడించారు. ప్రతీ మండల పరిధిలో నిపుణులతో ప్రత్యేక సదస్సులు నిర్వహించి కార్యకర్తలను ఆర్థికంగా స్థిరపడేలా ప్రోత్సహిస్తామన్నారు. అలాగే ప్రజలు, కార్యకర్తలు ఎదుర్కొంటున్న రెవెన్యూ సమస్యలను తోట కల్యాణమండపంలో జరిగే ప్రత్యేక సదస్సులో అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యకర్తలపై గతంలో నమోదైన అక్రమ కేసుల విషయమై ఎస్పీ స్థాయి అధికారులతో మాట్లాడామని, కార్యకర్తలకు అండగా ఉంటూ పూర్తి న్యాయం జరిగేలా చూస్తామని స్పష్టం చేశారు.

**రాచగుడిపల్లిలో ఇంటింటికీ తెలుగుదేశం ప్రచారం**

సమావేశం అనంతరం రాచగుడిపల్లి పంచాయతీ నందు కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా అబ్జర్వర్ భీమినేని చిట్టిబాబుతో కలిసి "ఇంటింటికీ తెలుగుదేశం" కార్యక్రమం నిర్వహించారు. చమర్తి జగన్ మోహన్ రాజు పంచాయతీలోని ప్రతీ ఇంటికీ వెళ్లి 'సూపర్ సిక్స్' పథకాల అమలు తీరును, ప్రజల అభిప్రాయాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని, పనులు చేసి చూపించే ప్రభుత్వమని పేర్కొంటూ, తాగునీటి సమస్య నివారణకు నూతన బోరు పాయింట్‌ను ప్రారంభించారు.

రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ లబ్ధి చేకూర్చడమే ప్రభుత్వ ధ్యేయమని, నియోజకవర్గంలోని ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ఈ సందర్భంగా చమర్తి పునరుద్ఘాటించారు. క్షేత్రస్థాయి నుంచి ప్రతి కేడర్ ఐక్యంగా శ్రమిస్తూ, ప్రభుత్వ అభివృద్ధి,సంక్షేమ ఫలాలను ప్రజల్లోకి తీసుకెళ్లి రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయాన్ని సునాయాసం చేయాలని పిలుపునిచ్చారు.

# ఇందిరమ్మ గృహాల పనుల్లో వేగం పెంచాలి : కలెక్టర్



నల్లగొండ (ఇది కద నిజం): హుజూర్ నగర్ లోనీ ఇందిరమ్మ మోడల్ కాలనీ, జి ప్లస్ వన్ ఇండ్ల పనుల్లో స్పీడు పెంచాలనీ సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు... ఇండ్ల సముదాయాల్లో మిగిలిపోయిన పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని స్పష్టం చేశారు..

హుజుర్ నగర్ లోని రామస్వామి గుట్ట వద్ద నిర్మిస్తున్న మోడల్ కాలనీ ఇండ్లను వివిధ శాఖల అధికారులతో కలిసి కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా పారదర్శకంగా ఇండ్ల పంపిణీ ప్రక్రియ పూర్తి చేస్తామని తెలిపారు. ఇండ్లతో పాటు డ్రైనేజీ, తాగునీరు, రోడ్లు వంటి మౌలిక వసతుల కల్పన పనులను వేగవంతం చేయాలని సూచించారు.

# హైదరాబాద్--చెన్నై బుల్లెట్ రైలు కారిడార్‌లో నకిరేకల్‌ను చేర్చాలి



నల్లగొండ (ఇది కద నిజం): ప్రతిపాదిత హైదరాబాద్--చెన్నై హైస్పీడ్ రైలు (బుల్లెట్ రైలు) కారిడార్‌లో నకిరేకల్‌ను చేర్చే అంశాన్ని పరిశీలించాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను ఈ రోజు ఢిల్లీలో కోరారు. గ్రీన్‌ఫీల్డ్ అలైన్‌మెంట్‌కు బదులుగా ఇప్పటికే ఉన్న ఎన్‌హెచ్--65 కారిడార్ మీదుగా రైలు మార్గాన్ని ప్రతిపాదిస్తే నకిరేకల్‌తో పాటు భువనగిరి పార్లమెంట్ పరిధిలోని పట్టణాలు, వాణిజ్య కేంద్రాలు, అధిక జనాభాకు మెరుగైన కనెక్టివిటీ లభిస్తుందని తెలిపారు. ఈ ప్రతిపాదనను సానుకూలంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని రైల్వే శాఖను కోరారు. ఈ సమావేశంలో నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కర్, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ తదితరులు వారి వెంట ఉన్నారు.

# ఎస్సీ ఎస్టీ కమీషన్ పర్యటన.. .

### ఎస్సీ ఎస్టీ ల సంక్షేమం కోసం కృషిచేయాలి



నల్లగొండ (ఇది కద నిజం): జిల్లాలో ఉన్న ఎస్సీ, ఎస్టీల సంక్షేమంతో పాటు వారికి రాజ్యాంగం కల్పించిన హక్కుల ప్రకారం సక్షేమ పథకాలను వర్తించే విధంగా అధి కారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. నల్లగొండ జిల్లా కలెక్టరేట్ లో ఎస్సీ ఎస్టీ కమీషన్ సభ్యులతో కలిసి జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ ఇతర అధికారులతో సమావేశం నిర్వహించారు.. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన భూ సమస్యలు, ఎస్సీ ఎస్టీ ల పై దాడులు , ఉద్యోగాల లో రోస్టర్ పాయింట్ అమలు, బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీ లో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ అమలు, తదిత అంశాలపై జిల్లా అధికారులతో సమీక్ష జరిపారు.. అంతరం కమీషన్ చైర్మన్ వెంకటయ్య మాట్లాడుతూ... షెడ్యూల్డు కులములు, తెగలలకు రాజ్యాంగం కల్పించిన చట్టాలను పక డ్బందీగా అమలు చేయాలన్నారు. , . ఎస్సీ, ఎస్టీ వసతి గృహాల విద్యా ర్థులకు దుప్పట్లు, యూనిఫాంలు, పుస్తకాలు, మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీ తో పాటు కాంటాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలలో కూడా రిజర్వేషన్ పాటించాలని సూచించారు..

# చెరువుగట్టు గిరి ప్రదక్షిణ



నల్లగొండ (ఇది కద నిజం): చెరువుగట్టు శ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామి ఆశీస్సులతో అందరికీ ఆయురారోగ్యాలు లభించాలని విశ్వహిందూ పరిషత్ నల్లగొండ జిల్లా ధర్మాచార్య సంపర్క్ ప్రముఖ్ ఉండ్యాల ప్రకాష్ రెడ్డి అన్నారు.. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లా నార్కట్పల్లి మండలం చెరువుగట్టు గ్రామంలో స్వయంభుగా వెలసి ఉన్న చెరువుగట్టు శ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామి దేవస్థాన కొండ చుట్టూ గిరి ప్రదక్షిణ నిర్వహించారు.. అమావాస్య సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో తరలి రావడంతో ఆలయ పరిసరాలు భక్తుల శివ నామ స్మరణతో మారుమోగింది.. గిరి ప్రదక్షణ అనంతరం భక్తులు స్వామివారికి అభిషేకాలు, భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కలు చెల్లించుకున్నారు.. స్వామివారి ఆశీర్వాదం పొందడం జరిగింది ఆయన మీడియాతో మాట్లాడుతూ.... ప్రతి అమావాస్య, పౌర్ణమి సందర్భంగా విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో గిరిప్రదక్షిణ నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమానికి భక్తుల నుంచి ఊహించని రీతిలో స్పందన లభిస్తుందని అన్నారు. ఆయుప్రదాతగా పేరు గాంచిన చెరువు గట్టులో ప్రతి అమావాస్యకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న లక్షకు మించి భక్తులు తరలివచ్చి కొండపై నిద్ర చేస్తే వ్యాధులు, దుష్ట శక్తుల భయం పోతుందని నమ్మకముందని, అందుకే భక్తులు వచ్చే గిరి ప్రదక్షిణలో అత్యధిక సంఖ్యలో పాల్గొనవలసిందిగా పిలుపునిచ్చారు... ఈ కార్యక్రమంలో రామలింగయ్య గారు గురుస్వామి వెంకటయ్య గారు ప్రభాకర్ గారు ప్రియాంక, గుండాగోని నాగరాజు శ్రావణి తదితరులు పాల్గొన్నారు ..